క్లుప్తంగా

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోండి



మాయాదేవికి చెక్కు ఇస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: తపాలాశాఖ అందిస్తున్న జీవిత బీమాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఆదివారం అన్నారు. శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి హర్షవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇతను గతంలో తపాలాశాఖలో ఏడాదికి రూ.72వేలు చొప్పున మూడు సంవత్సరాలు చెల్లించాడు. హర్షవర్ధన్ మృతి చెందడంతో అతని తల్లి మాయాదేవికి ఆదివారం రూ.6,47,581ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇతర బీమా కంపెనీల కన్నా తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ వస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ అధికారులు కుషిత్ బేగం, వాసుదేవ, మురళి, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజరు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మునిచంద్రయ్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజరుగా టి.మునిచంద్రయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ కోసం కలిసికట్టుగా పనిచేసి లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, యూనియన్ నాయకులు ట్రాఫిక్, గ్యారేజీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మునీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పిచ్చాటూరు మార్గంలోని మునీశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర మోహన్ అనే భక్తుడు తన మిత్రులతో కలిసి దేవుని చెట్టు చుట్టూ ప్రహరీ వేసి ఆలయంగా గుర్తింపు తెచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు స్ఫూర్తిదాయకం



వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న సుబ్బరామిరెడ్డి

శ్రీకాళహస్తి: హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు స్ఫూర్తిదాయకమని రాయలసీమ జూనియర్ కళాశాల అధినేత కాయం సుబ్బరామిరెడ్డి అన్నారు. హెల్పింగ్‌హ్యాండ్స్ ఆదివారం నిర్వహించిన వృద్ధులు, దివ్యాంగుల నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అందజేశారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు ప్రతి నెలా ఇలా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషకరమని తెలిపారు. ఈ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం తమ కళాశాలలో ఇద్దరు విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, బాబా ఫరీద్, హరినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదపు అంచుల్లో విద్యుత్ టవర్



శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం పిల్లపాలెం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న 220 కేవీ విద్యుత్ టవర్ ప్రమాదపు అంచుల్లో ఉంది. నది ఒడ్డున ఉన్న ప్రైవేట్ భూముల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. టవర్‌కు అతి సమీపంలోనే సుమారు 20 అడుగుల లోతు వరకు తవ్వకాలు నిర్వహించారు. వర్షాలు వచ్చి టవర్ కింద ఇసుక కోతకు గురైతే టవర్ నేలకూలే ప్రమాదం పొంచి ఉంది. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక రైతుల కోరుతున్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలోనూ ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం హైడ్రోపోనిక్ పద్ధతిలో మట్టిలేకుండా వ్యవసాయం చేస్తున్నారు. సత్యవేడుకు చెందిన పి.సుధాకర్ లాయర్ వృత్తిని వదిలి హైడ్రోపోనిక్ పద్ధతిలో ఆకుకూరలు సాగు చేస్తూ అధిక దిగుబడితోపాటు ఆదాయం పొందుతున్నారు. ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మట్టిలేని సాగు.. లాభాలు బాగు



కోతకు వచ్చిన పాల కూరను కోసి సేకరిస్తున్న కూలీలు

- దుమ్ము ధూళి చేరని పంట
- కలుపు సమస్యలు లేవు
- అధిక పంట దిగుబడి సాధ్యం
- జడ పదార్థంగా టెంకాయ పీచు
- అధిక శాతం నీరు ఆదా

సత్యవేడు: సత్యవేడు పంచాయతీలో మాతంగేశ్వరాలయానికి వెళ్లే ప్రాంతంలో రైతు పి.సుధాకర్ హైడ్రోపోనిక్ ఫాం హౌస్ (గ్రీన్ హౌస్)ను శివ కార్తికేయ ఆగ్రోఫాం పేరున నిర్వహిస్తున్నారు. 25 సెంట్ల పొలంలో ఒక ఎకరాలో సాగు చేసే పంటలను సాగు చేస్తున్నారు.

సబ్సిడీతో ఫాంహౌస్

ప్రభుత్వం సబ్సిడీతో పాలీహౌస్‌ను రూ.9.50 లక్షలతో నిర్మించారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ రూ.4.25 లక్షలు పొందారు. తన సొంత పొలంలో ఫాంహౌస్ ఏర్పాటు చేశారు. దానికి విద్యుత్ కోసం 9.5 కేవీ సోలార్ సిస్టంను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం సుమారు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు ఖర్చు చేశారు. రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి హైడ్రోపోనిక్ సెట్ అమర్చారు. దీన్ని భూమికి 4 అడుగుల ఎత్తులో ట్రేలు, పైపులతో ఏర్పాటుచేశారు. ఆకు కూరల విత్తనాలను ఢిల్లీ, గుజరాత్, హైదరాబాద్ నుంచి తెచ్చుకొంటున్నారు. ఆయన ముఖ్యంగా స్పినాచీ(పాలకూర), ఇటాలియన్ బేసిల్, థామ్‌బేసిల్, కర్లకేల్, రావెట్ ఆరుగల, పొక్షయి, ఎగ్జోటిక్ చీఫ్ చెర్రీ టమాటా పండిస్తున్నారు. ముందుగా ట్రేలలో జడ పదార్థంగా టెంకాయ పీచును వినియోగిస్తారు. వాటిలో విత్తనాలు వేస్తారు. విత్తనాలు మొలకెత్తిన తర్వాత కోకో పిట్‌లో టెంకాయ పీచు కేబుల్ ఉంచి అందులో విత్తనం వేసి ఫిల్టర్ చేసిన నీటిని చల్లి మొలకెత్తిన మొక్కలను కప్పుల్లో పెంచుతున్నారు. అనంతరం పైపుల్లో మినరల్, న్యూట్రియన్స్ కలిపి మొక్కలకు నీరు అందేలా అమర్చుతున్నారు.



ఆకు కూరను తూకం వేసి ప్యాకింగ్ చేస్తున్న మహిళ

పంటసాగుకు 3 నెలలు..

మొదటి కోత 30 రోజులకు వస్తుంది. రెండో కోత వారానికి రెండు పర్యాయాలు వస్తుంది. ఇలా మూడు నెలలు ఆకు కూర పంట వుంటుంది. అనంతరం ట్రేలను మళ్లీ శుభ్రం చేసి కొత్త పంట సాగు చేస్తారు.

ఆకుకూరల ధర కేజీలో..

స్పినాచీ(పాలకూర) కేజీ రూ.150, ఇటాలియన్ బేసిల కేజీ రూ.400, థాయ్‌బేసిల్ రూ.400, జలోపియా మిరప కేజీ రూ.400, కర్లకేల్ రూ.400, రావెట్‌అరగుల రూ.400, చెర్రీ టమాటా కేజీ రూ.400 విక్రయిస్తున్నారు. ఇక్కడ పండించిన పంట ఉత్పత్తులను చెన్నైలోని సూపర్ బజార్లు, ఫైవ్ స్టార్ హోటళ్లకు 100 గ్రాములు, 250 గ్రాములు, 500 గ్రాముల చొప్పున ప్లాస్టిక్ కవర్లలో నింపి సీలు వేసిన ప్యాకెట్లను టెంపోలో పంపిస్తున్నారు.

ఫిల్టర్ వాటర్‌తో సాగు

బావి నీటిని మోటారు ద్వారా ట్యాంకుకు చేర్చి దాన్ని ఫిల్టర్ చేసి న్యూట్రీషన్ ట్యాంకుకు చేర్చుతున్నారు. న్యూట్రీషియన్ ట్యాంకులో మొక్కకు కావాల్సిన ఎరువు, పోషకాలు అందించి ట్యాంకు ద్వారా ఎన్ఎఫ్‌టీ చానల్స్ ద్వారా మొక్కలకు పోషక ద్రావణం పైపుల ద్వారా అరగంటకోసారి అందజేస్తున్నారు. మొక్కల వేర్లు అవసరమైన పోషక ద్రావణాన్ని తీసుకుంటాయి. తగిన మోతాదులో నీరు నిల్వ ఉండేలా చేస్తున్నారు. మిగిలిన నీరు (సర్క్యులేషన్ విధానం) తిరిగి న్యూట్రీషన్ ట్యాంకులోకి చేరుతోంది. మొక్కలకు అందించే పోషక ద్రావణం నీటిలో లవణాల శాతం, ఉదజని సూచిక శాతం సమతుల్యంగా ఉండేలా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఉష్ణోగ్రత 32 డిగ్రీలు మించకుండా ఫ్యాన్లు అమర్చారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు సాగు చేస్తున్నారు. పరిజ్ఞాన నైపుణ్యం అవసరమని రైతు తెలిపారు.



ప్రయోగాత్మకంగా ఫాంలో పెంచుతున్న చెర్రీ టమాట పంట



ఫాంలో సాగు చేసిన మిరప పంట



ఎన్‌టీఎఫ్ చానల్స్‌లో పెంచుతున్న స్పినాచ్(పాలకూర)

హైడ్రోపోనిక్ పద్ధతిలో సాగు ఆదాయమే



హైడ్రోపోనిక్ పద్ధతిలో ఆకుకూరల సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. వ్యవసాయం పట్ల మక్కువ ఉండడంతో న్యాయవాది వృత్తిని వదిలి వ్యవసాయం చేస్తున్నాను. నాతో పాటు ఫాంలో నలుగురు కూలీలు రోజూ పనిచేస్తున్నారు. నెలకు కూలీలకు 50 వేలు ఖర్చు అవుతోంది. – పి.సుధాకర్, సత్యవేడు

బావి నీటిలో పీచు పెరగకుండా సలహాలు



ఫారం కోసం ఏర్పాటు చేసుకున్న బావిలో పీచు చేరకుండా రైతులకు సలహాలు అందిస్తున్నాం. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ప్రభుత్వ సబ్సిడీల వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. గ్రామసభల్లో హైడ్రోఫోనిక్ ఫాంలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. – మురళీ, వ్యవసాయాధికారి, సత్యవేడు

నెప్పళ్ల మండపాన్ని పునర్నిర్మించాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం భిక్షాల గాలిగోపురం పక్కనే ఉన్న నెప్పళ్ల మండపాన్ని పునర్నిర్మించాలని హిందూ ధార్మికమండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు కోరారు. ఆయన ఆదివారం నెప్పళ్ల మండపాన్ని పరిశీలించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో రథోత్సవం రోజున అమ్మవారికి ఈ మండపంలో పూజలు చేస్తారని చెప్పారు. ఇది దెబ్బతినడంతో పదేళ్ల క్రితం తొలగించి రేకుల షెడ్డు నిర్మించారన్నారు. అప్పటినుంచి అందులోనే పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అధ్వర్యంలో పలు పురాతన మండపాలు, ఆలయాలను పునర్నిర్మిస్తున్నా దీనిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాసుయాదవ్, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.



నెప్పళ్ల మండపాన్ని పరిశీలిస్తున్న రమేష్‌బాబు

మృతురాలి కుటుంబానికి నివాళి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కాసరం గ్రామానికి చెందిన కాంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం జరిగిన ఆమె కర్మక్రియల్లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కాంతమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

జోరుగా వరికోతలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, కమ్మ వారికండ్రిగ గ్రామాల్లో వరికోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ గ్రామాల్లో రబీ సీజన్‌లో 1850 ఎకరాల్లో వరి పంట సాగైంది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పాటు తెలుగుగంగ నీటితో చెరువులు నిండాయి. ఈ క్రమంలో రైతులు ఉత్సాహంగా పంట సాగు చేశారు. ఈ దఫా పంటలకు తెగుళ్లు ఎక్కువగా సోకడంతో దిగుబడి తగ్గి ఎకరాకు 25 బస్తాలు మాత్రమే ధాన్యం వచ్చింది. వరి ధాన్యానికి మార్కెట్‌లో ధర లేక పోవడంతో ఆదాయం తగ్గిందని, గత సంవత్సరం వరి ధాన్యానికి ధర ఎక్కువగా ఉండడంతో ఆదాయం బాగా వచ్చిందని రైతులు అంటున్నారు. వరికోతల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.



కల్లివెట్టులో వరిపంటను కోస్తున్న యంత్రం



నెలవాయిలో రైతులు ఎండబెట్టిన వరి ధాన్యం

మామిడికి మంచు దెబ్బ



కనమనంబేడు గ్రామంలో పూతరాని మామిడి చెట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచుతో మామిడి చెట్లకు పూత రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కనమనంబేడు, గాజులపెళ్లూరు, కుక్కంబాకం, కంచనపుత్తూరు, ఆలత్తూరు, పీవీకండ్రిగ, బుచ్చినాయుడు కండ్రిగ, కల్లివెట్టు, నెలవాయి, వెస్టువరత్తూరు గ్రామాల్లో 400 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ప్రతి సంవత్సరం డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. పూత వచ్చిన సమయంలో వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే జనవరి నెలలో వర్షాలు పడడం తోపాటు అధికంగా పొగ మంచు కురుస్తుండడంతో మామిడి పూత రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండాల్సిన మామిడి తోటలు మంచుతో నష్టం కలిగిస్తోంది. తోటలు కౌలుకు తీసుకున్న రైతులు అధికంగా కురుస్తున్న మంచుకు పంటలపై ఆశలను వదులుకుంటున్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని, ఈ ఏడాది అదే కొనసాగుతుందని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొగమంచుతోనే పూత రావడం లేదు

పొగమంచు అధికంగా ఉండడంతోనే తేనె మంచు పురుగు ఆశించడంతో పిందెలు, కాడల రసాన్ని పీల్చడంతో మామిడి తోటలకు నష్టం వాటిల్లుతోంది. దీని నివారణకు కాన్ఫిడార్ మందు 0.5 ఎంఎల్, సాఫ్ 2 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25 ఎంఎల్ లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.

– యామిని, ఉద్యాన శాఖాధికారి

ఏకాత్మతా యాత్ర ప్రతినిధులకు ఘన స్వాగతం

రేణిగుంట: ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన భారత ఏకాత్మతా యాత్ర ప్రతినిధులకు రేణిగుంట రైల్వే స్టేషన్లో ఆదివారం ఘన స్వాగతం అభించింది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భారత ఏకాత్మతా యాత్ర దక్షిణాది రాష్ట్రాలకు సాగుతుంది. ఈ యాత్రలో భాగంగా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 26 మందితో కూడిన ప్రతినిధుల బృందం తిరుపతికి వచ్చారు. వారికి రేణిగుంట రైల్వే స్టేషన్లో ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్, వ్యాపారవేత్త డాలర్స్ దివాకర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ తెలుగు గొప్పదనాన్ని, ఆంధ్ర ప్రదేశ్ సంస్కృతి సంప్రదాయాలు, విద్యా సంస్థలు, తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రాశస్త్యాన్ని వివరించారు. నాలుగు రోజులు పాటు ఈ బృందం జిల్లాలోని శ్రీహరికోట, శ్రీసిటీ, ఐఐటీ, ఐసర్, ఎస్వీ యూనివర్సిటీ, సంస్కృత వర్సిటీలో ఉపాధ్యాయులు, ఆచార్యులు, విద్యార్థులతో చర్చించనున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్గాన్ని సోమశేఖర్, డాక్టర్ మాలపాటి వెంకట రమణయ్య, రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్, విభాగ కార్యదర్శి పూజారి రాఘవేంద్ర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఆర్ఎస్ఎస్, విద్యార్థి సంఘాలు

పైపులైన్ పనుల్లో నిర్లక్ష్యం

- శ్రీకాళహస్తి–తడ మార్గంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన తవ్వకాలు
- పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తి–తడ మార్గంలో వాహనదారులకు పైపులైను పనులు శాపంగా మారాయి. వారు చేపడుతున్న నిర్లక్ష్యపు పనులతో ఎక్కడబడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే తవ్వకాలు జరిపి పనులు పూర్తి చేయకనే మట్టికుప్పలను వదిలేస్తున్నారు. దీని కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుకు అడ్డంగా పోసిన మట్టి కుప్పలను గమనించక వాహనదారులు ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక తవ్వకాలు జరిపిన ప్రాంతంలో రోడ్డు పొడవునా మట్టి కుప్పలను డంప్ చేయడంతో ఆ మార్గంలో ఎదురెదురు వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో పైపులైను పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక వాహనదారులు, ప్రజలు ప్రశ్నించినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ నిర్లక్ష్యపు పనులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.



తడ-శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు మార్గంలోని వేణుగోపాలపురం వద్ద రోడ్డు పక్కనే మట్టి కుప్పలు



సుబ్బరాజుకండ్రిగ వద్ద రోడ్డుకు అడ్డంగా మట్టికుప్పలు

ముక్కంటి సేవలో ప్రముఖులు



కాణిపాకం ఈవో పెంచలకిషోర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు



ఆలయం వద్ద కుటుంబంతో ప్రీతి నిగం



ఆలయం వద్ద దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈవో బాపిరెడ్డి, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కాణిపాకం ఆలయ ఈవో పెంచలకిషోర్ దర్శించుకున్నారు. అలాగే ప్రముఖ బుల్లితెర నటి ప్రీతి నిగం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.